క్లుప్తంగా

నేడు ధ్యాన ఆత్మజ్ఞాన శిబిరం

మిర్యాలగూడ : పంచభూత పిరమిడ్ ఆధ్వర్యంలో సోమవారం దామరచర్ల మండల కేంద్రంలోని లక్ష్మారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ధ్యాన్య ఆత్మ జ్ఞాన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సూర లక్ష్మీరెడ్డి ఆదివారం తెలిపారు. భీమవరానికి చెందని బ్రహ్మర్షి తటవర్తి వీర రాఘవ రావు సోమవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆత్మ /్ఞాన శిక్షణ ఇవ్వనున్నట్లు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

కేజీబీవీకి విద్యుత్ మోటారు అందజేత



విద్యుత్ మోటారును అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో నూతనంగా ప్రారంభమైన కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)కి నీటి సరఫరా కోసం కస్తూరి ఫౌండేసన్ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్ ఆర్థిక సహకారంతో మోటారును ఆదివారం ఫౌండేషన్ సభ్యుడు పిన్నింటి నరేందర్‌రెడ్డి పాఠశాల సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ పాఠశాలకు మోటారును అందజేయడంపై కస్తూరి ఫౌండేషన్ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలకు ఎంపిక

నల్లగొండ టౌన్: కేరళ రాష్ట్రంలోని కోజికోడ్‌లో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు జరుగనున్న ఎస్ఎఫ్ఐ అఖిల భారత 18వ మహాసభలకు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ ఎంపికయ్యారు. నల్లగొండ జిల్లా నుంచి మహాసభలకు ఐదుగురు ఎంపికయ్యారని శంకర్ తెలిపారు.

జ్ఞాన సమాజ నిర్మాణమే స్వేరోస్ ధ్యేయం



సమావేశంలో పాల్గొన్న స్వేరోస్ నాయకులు

నల్లగొండ: జ్ఞాన సమాజ నిర్మాణమే ధ్యేయంగా స్వేరోస్ పనిచేయాలని స్వేరోస్ రాష్ట్ర చీఫ్ కన్వీనర్ బల్గూరి దుర్గయ్య అన్నారు. ఆదివారం నల్లగొండలో నిర్వహించిన స్వేరోస్ సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో స్వేరోస్ రాష్ట్ర కో కన్వీనర్ అనుముల సురేష్, జిల్లా అధ్యక్షుడు బొజ్జ పాండు, రాజు, కుక్కముడి శ్రీనివాస్, యాదమ్మ, చరణ్, వినోద్ పాల్గొన్నారు.

రజాకారు సినిమాకు అవార్డు రద్దు చేయాలి

నల్లగొండ టౌన్: రజాకర్ సినిమాకు గద్దర్ పేరిట ప్రభుత్వం అవార్డు ఇవ్వడం గద్దర్ నమ్మిన సిద్ధాంతానికి వ్యతిరేకమని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అవార్డును రద్దు చేయాలని కోరారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తూ నిర్మించిన రజాకారు సినిమాకు అవార్డు ఇవ్వాలని తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు.

మహిళా అధ్యక్షురాలిగా శారద



పెద్దవూర : మాల మహానాడు పెద్దవూర మండల మహిళా అధ్యక్షురాలిగా మండలంలోని పోతునూరు గ్రామానికి చెందిన మద్దూరి శారదను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన మాల మహానాడు మండల ముఖ్య నాయకుల సమావేశంలో ఆమెను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు లకుమాల మధుబాబు, మండల అధ్యక్షుడు మద్దూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మద్దూరి సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్లేపల్లిలో ఇంటింటి సర్వే

మిర్యాలగూడ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం దర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్‌లో భాగంగా ఆదివారం దామరచర్ల మండలంలోని కల్లేపల్లి గ్రామంలో వసతిగృహ సంక్షేమశాఖ అధికారులు నరేష్, సతీష్‌కుమార్‌లు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన తండాల్లోని ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పీఎం దర్తీ ఆబా యోజనను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ పథకం కింద వచ్చే ఐదేళ్లలో గిరిజనతండాల్లో డ్రెయినేజీ, రోడ్లు, తాగునీరు, విద్యుత్, నైపుణ్య శిక్షణ కేంద్రాలు వంటి వాటిని కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

రహదారిని పూర్తిచేయరూ..

- రెండేళ్లుగా ప్రారంభం కాని పనులు
- రహదారి లేక ఇబ్బందులు
- రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్నామని రైతుల ఆవేదన



మట్టి పోసి వదిలేయడంతో అధ్వానంగా మారిన రహదారి



పూర్తయిన కల్వర్టులు

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని చింతచెట్టు తండా నుంచి గాజీనగర్ గ్రామానికి వెళ్లేందుకు గత ప్రభుత్వ హయాంలో బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. కానీ ఆ పనులు మధ్యలోనే ఆపివేశారు. మట్టిబాట నిర్మాణానికి ఎస్‌డీఎఫ్, ఎఫ్‌డీఆర్ నిధుల క్రింద రూ.9.40లక్షలకే టాయించారు. బీటీ రోడ్డు నిర్మాణానికి ఎస్టీ ఎస్‌డీఎఫ్ నిధుల కింద రూ. 1.44 కోట్లతో 2023లో మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ శంకుస్థాపన చేశారు. కాని ఇప్పటివరకు ఈ పనులు పూర్తి కాలేదు. కేవలం మట్టి మాత్రమే పోసి కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నాడు. ఈ రోడ్డు నిర్మాణంలో సీసీ తండా నుంచి గాజీనగర్ వరకు మధ్యలో రెండు చోట్ల కల్వర్టులు, గాజీనగర్ గ్రామ సమీపంలో బ్రిడ్జిని మాత్రమే పూర్తి చేశారు. కాని మిగతా నిర్మాణ పనులు మాత్రం పూర్తి చేయలేదు. ఈ విషయంపై అధికారులను సంప్రదించగా తండావాసులు తమ భూముల మీదుగా రోడ్డు వెళ్లడం ద్వారా భూమిని కోల్పోతున్నామని ఆక్షేపన చెప్పడంతో పనులను నిల్పివేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. గతంలో కూడా ఈ సీసీ తండా నుంచి గాజీనగర్ గ్రామానికి వెళ్లడానికి ఇదే రోడ్డు మార్గం ఉన్నప్పటికీ రైతులు ఆక్షేపన చెప్పారు. అంతేగాక భూములు కోల్పోయే రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామంటున్నప్పటికీ రైతులు ఒప్పుకోకపోవడంతో రోడ్డు నిర్మాణ పనులను మధ్యలోనే ఆపివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అధికారులు పేర్కొంటున్నారు.

రోడ్డులేక ఇబ్బందులు

గాజీనగర్ గ్రామం నుంచి కొండమల్లేపల్లికి రావడానికి సరైన రోడ్డు లేక దేవరకొండ మీదుగా చుట్టూ తిరిగి కొండమమల్లేపల్లికి రావల్సివస్తుంది. కొండమల్లేపల్లి మండలం కావడంతో ప్రతి పనికి కూడా చుట్టూ తిరిగి రావల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అధికారులు రైతులతో త్వరితగతిన మాట్లాడి రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

రైతులతో మాట్లాడుతాం

చింతచెట్టు తండా నుంచి గాజీనగర్ బీటీ రోడ్డు పనులు రైతులు భూాలు కోల్పోతమని చెప్పడంతోనే పనులు ఆగాయి. 2023లో రోడ్డు పనులు ప్రారంభించగా రెండు కల్వర్టులు, బ్రిడ్జి పనులను పూర్తిచేశాం. త్వరలోనే రైతులతో మాట్లాడి రోడ్డు నిర్మాణం పూర్తయ్యేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– నవీన్, ట్రైబల్ ఏఈ

ఆలయ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలి



గణేష్ మార్కెట్ ఆలయ వార్షికోత్సవ లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ : పట్టణంలోని గణేష్ మార్కెట్‌లోని విఘ్నేశ్వర దేవాలయ 50వ నవరాత్రి వార్షికోత్సవ వేడుకల లోగోను ఆదివారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1976లో ప్రారంభించిన గణేష్ నవరాత్రి వేడుకలను 50ఏళ్ల నిరాటంకంగా కొనసాగిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. ఆగస్టు 27నుంచి సెప్టెంబర్ 5వరకు నిర్వహించే 50వ వార్షికోత్సవ వేడుకలను భక్తులు విజయవంతం చేయాలని, వార్షికోత్సవానికి తన వంతుగా సహాయ, సహకారాలు అందిస్తానని తెలిపారు. దాతలు, భక్తుల సహకారంతో ప్రతి ఏటా వినూత్నమైన భారీ సెట్టింగ్‌లతో పట్టణంలోనే ఎత్తయిన గణేశ్ ప్రతిమను ప్రతిష్ఠిస్తూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పాలిశెట్టి యాదగిరి, అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడమే మోదీ లక్ష్యం



మిర్యాలగూడ టౌన్ : సమావేశంలో మాట్లాడుతున్న సాధినేని శ్రీనివాస్‌రావు

మిర్యాలగగూడ టౌన్ : పేదల ఆకలిని తీర్చడమే భారత ప్రధాని నరేంద్రమోదీ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు, బీజేపీ సీనియర్ నేత బంటు సైదులు అన్నారు. ఆదివారం వన్ టౌన్ పరిధిలోని 4వ వార్డు ఈదుల గూడెం బొడ్రాయి వద్ద మోదీ 11నెలల పాలనపై నిర్వహించిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. మోదీ దేశ ప్రగతి కోసం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేశారన్నారు. వన్ టౌన్ అధ్యక్షుడు బంటు గిరి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎడ్ల రమేష్, కొండేటి సరిత, తల్లం అశోక్, కన్మంతరెడ్డిడ అశోక్‌రెడ్డి, జానాబాయి, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి చిల్లంచర్ల అభి, చిలుకూరి శ్యాం, బంటు యాదగిరి, మండల సోములు, కొంగరి వెంకటరమణ, మూల రాజిరెడ్డి, నక్క రవిబాబు, కంచుకొమ్ముల వేణు, శివ, రవిచంద్ర, రాపర్తి శ్రీనివాస్ తదితరులున్నారు.

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలో ఆదివారం వికసిత్ భారత్ మండల సంకల్ప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ శివర్ల రమేష్‌యాదవ్, మాజీ పార్లమెంట్ కన్వీనర్ నక్క వెంకటేష్‌యాదవ్‌లు మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తూ, అవినీతి రహిత పాలనను కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు మద్దతు ధర కల్పించిందని, కరోనా సమయంలో ప్రతి ఒక్కరికి 5 కిలోల బియ్యం ఉచితంగా అందించిదని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో రూ.2.50 లక్షలు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు భూతరాజు భరత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మల్లేష్‌యాదవ్, చందునాయక్, వశ్యానాయక్, లక్ష్మణ్‌నాయక్, చందు, అనిల్, హనుమంతు, మోహన్, జనార్దన్, సంధ్య పాల్గొన్నారు.

డ్రెయినేజీలు నిర్మించాలి



రవీంద్రనగర్ కాలనీలో డ్రెయినేజీని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని పదో వార్డు రవీంద్రనగర్‌లో డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బావండ్ల పాండు అన్నారు. ఆదివారం రవీంద్రనగర్ కాలనీలో పర్యటించి ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో డ్రెయినేజీ లేకపోవడంతో మురుగునీరు ఇళ్ల మధ్యలోనే ఉండి దోమలు, దుర్గంధం వస్తుందని, దీంతో కాలనీ ప్రజలు రోగాల భారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చకపోతే ప్రజలను సమీకరించి ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలు కోణతం నీరజ, మల్లేష్, మారోని, వేణు, అన్వర్, కవిత, జ్యోతి సునీత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని నారాయణ విద్యాలయం 1989–90 బ్యాచ్ చెందిన 10వ తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం హైదరాబాద్‌లోని బొంగులూరు పార్కులో నిర్వహించారు. 35ఏళ్ల తరువాత ఒకేవేదికపై కలుసుకొని ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఒక్కొక్కరు ఏఏ స్థాయిలో స్థిరపడ్డారు తెలియజేసుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులందరూ ఒకే వేదిక పేరుతో 'ఎన్‌వీఎం డైమాండ్'పేరును నామకరణం చేశారు. ప్రముఖ ఎన్ఆర్ఐ దుర్గాప్రసాద్ వనమాల దంపతులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చలమల లక్ష్మి, రంగా మాధవి, హిందుమతి, చింతిరెడ్డి మరుద్వతి, రాచకొండ రమేష్, కుందూరు సైదిరెడ్డి, బొగ్గారపు సురేందర్, గొంగటి సైదిరెడ్డి, కృపాకర్ రెడ్డి, రాంరెడ్డి, సతీష్, నగేష్, రవీందర్‌రెడ్డి, కిరణ్ తదితరులున్నారు.

పేద ప్రజలకు అండగా సీపీఐ జెండా



గుర్రంపోడు : పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

గుర్రంపోడు : ప్రజా ఉద్యమాలే ఊపిరిగా, పోరాటాలే ప్రాణంగా ప్రజలకు అండగా సీపీఐ జెండా నిండా నిలబడి పోరాడుతుందని ఎమ్మెల్సీ, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. ఆదివారం గుర్రంపోడులో నిర్వహించిన సీపీఐ మండల మహాసభలో ముఖ్యఅతిథిగా హాజరై జెండావిష్కరణ అనంతరం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేకవిధానాలకు తిప్పికొట్టాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి జిల్లా అంతటికీ సాగు, తాగు నీరు అందించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ మహాసభలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. అంజాచారి, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి బి.జగన్, మండల కార్యదర్శి రేపాక లక్ష్మీపతి, నాంపల్లి మండల సీపీఐ కార్యదర్శి ఎస్ రమేష్ మండల నాయకులు ఉజ్జిని రామచందర్ రావు, మాజీ జెడ్పీటీసీ వెంకటయ్య, మదార్, శంకరాచారి, యాదయ్య, అంజయ్య, ఇస్తారి, బి. శ్రీను, నర్సింహ్మా చారి, పర్వత రెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ముగిసిన అన్నదానం



గ్రంథాలయంలో యువతకు అన్నం వడ్డిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు, తదితరులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని మేరెడ్డి రామచంద్రారెడ్డి స్మారక గ్రంథాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సూచనల మేరకు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు చేపట్టిన మధ్యాహ్న భోజనం ఆదివారం ముగిసింది. ఈ మధ్యాహ్న భోజనాన్ని లయన్స్ క్లబ్, రైస్‌మిల్లర్స్ సహకారంతో చేపట్టారు. ఈ వంద రోజుల పాటు అన్ని విధాలుగా సహకరించిన గుడిపాటి శ్రీనివాస్–అనిత దంపతులతో పాటు హిమాలయ ఫార్మ, తోట వేణుమాధవ, చిదురాల శ్రీనివాస్, లయన్స్ క్లబ్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఎనిగండ్ల లింగయ్య, బీఎం నాయుడు, కర్నాటి రమేష్, ముక్కపాటి వెంకటేశ్వర్‌రావు, ప్రతాప్, పాశం రవీందర్‌రెడ్డి, డాక్టర్ జాడీ రాజు, గుండా రామారావు, ఏచూరి మురహరి, భాగ్యలక్ష్మి, వెంకటేశం, సైదులు, సింగు రాంబాబు, శంకర్‌రెడ్డి, సైదులు, సత్యనారాయణరెడ్డి, ముత్యాలక్ష్మిలతో పాటు పలువురు సభ్యులున్నారు.

రోడ్లు నిర్మించాలంటూ సైకిల్ యాత్ర

నల్లగొండ టూటౌన్: గ్రామీణ రోడ్ల నిర్మాణం, అభివృద్ధి కోసం నల్లగొండ మండలం పెద్ద సూరారం గ్రామానికి చెందిన తెలంగాణ గ్రామీణ రహదారుల నిర్మాణ అభివృద్ధి సాధన సమితి కన్వీనర్ భీమనబోయిన జానయ్య సైకిల్ యాత్ర చేపట్టారు. ఆదివారం నల్లగొండ పట్టణం నుంచి సైకిల్ యాత్ర ప్రారంభించారు. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయానికి వెళ్లి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతి పత్రం ఇవ్వనున్నట్లు జానయ్య తెలిపారు. గ్రామాలను అనుసంధానం రోడ్ల నిర్మాణం చేపట్టాలని, ప్రతి గ్రామం నుంచి సమీపంలోని మార్కెట్‌కు రైతులు తమ పంటలను తీసుకెళ్లేందుకు రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసేందుకు సైకిల్ యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు.



సైకిల్ యాత్ర చేస్తున్న జానయ్య

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మిర్యాలగూడ టౌన్: అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మయ్య



అడవిదేవులపల్లిలో..

మిర్యాలగూడ టౌన్ : యువత మాదక ద్రవ్యాల నుంచి విముక్తి పొందాలని మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ మల్లికంటి లక్ష్మయ్య అన్నారు. ఆదివారం మిర్యాలగూడ మండలం దుర్గానగర్ కాలనీలో రూరల్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగిస్తే కలిగే అనార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ రూరల్ ఏఎస్ఐ రాములునాయక్, హెడ్ కానిస్టేబుల్ జానకిరాములు, కానిస్టేబుల్ నాగరాజు, భద్రు, నగేష్, మహేష్, శ్రీను, శంకర్ తదితరులున్నారు.

అడవిదేవులపల్లి మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్, మాదక ద్రవ్యాలు వినియోగిస్తే జరిగే అనర్థాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ఎవరైనా మత్తుపదార్థాలు అమ్మిన, కొనుగోలు చేసిన వారి కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు హరి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ నిధుల్లో కేంద్రం కోత



మాట్లాడుతున్న నారి ఐలయ్య

నల్లగొండ టౌన్: నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉపాధి హామీ నిధుల్లో కోత విధించి కార్పొరేట్ శక్తులకు చేయూతనిస్తోందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య ఆరోపించారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని సుందరయ్య భవన్‌లో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ పాలనలో వ్యవసాయ కార్మికులకు, పేదలకు, కౌలు రైతులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మోదీ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జూలై 9న నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండంపల్లి సరోజ మాట్లాడుతూ రాష్ట్రంలో మిగిలి ఉన్న కోటి 50 లక్షల ఎకరాల మిగులు భూమిని భూమి లేని ప్రతి కుటుంబానికి 2 ఎకరాల చొప్పున పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో తెలకలపల్లి శ్రీను, సిరిశాల గిరికుమార్, అశ్విని, దండంపల్లి యాదయ్య, కృష్ణ, సర్దార్ అలీ, మారయ్య, చెరుపల్లి శివమ్మ, అశోక్, రాజు పాల్గొన్నారు.

ఒలింపిక్ రన్



ఒలింపిక్ రన్ ప్రారంభిస్తున్న హఫీజ్‌ఖాన్

నల్లగొండ టూటౌన్: జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కాలేజీ నుంచి ఇండోర్ స్టేడియం వరకు ఒలింపిక్ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అసోసియేషన్ చైర్మన్ హఫీజ్‌ఖాన్ ప్రారంభించారు. అనంతరం జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి అక్బర్ అలీ మాట్లాడుతూ జిల్లాకు చెందిన క్రీడాకారులు క్రీడల్లో జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలోనే ఉంచాలని కోరారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కర్తయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఇమామ్ కరీం, బొమ్మపాల గిరిబాబు, కవిత, విమల, బండారు ప్రసాద్, లింగయ్య, యూనస్, ఏకస్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై పారుతున్న మురుగునీరు



అడవిదేవుపల్లి మండలంలోని బంగారుకుంటతండా లో మురుగు కాలువలు సక్రమంగా లేవు. దీంతో మురుగు రోడ్లపై చేరుతుంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ఈ సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. – అడవిదేవులిపల్లి

బాబోయ్ కోతులు.. తప్పని వెతలు

- దేవరకొండ పట్టణంలో స్వైరవిహారం చేస్తున్న వానరాలు
- కోతుల దాడిలో గాయాలపాలవుతున్న ప్రజలు



ఇళ్లపై సంచరిస్తున్న కోతులు

దేవరకొండ : దేవరకొండ పట్టణంలో రోజు రోజుకు కోతులు పట్టణ వాసులను బెంబేలెత్తిస్తున్నాయి... రాత్రి, పగలు అని తేడా లేకుండా కాలనీల్లో స్వైర విహారం చేస్తూ పట్టణ వాసులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. గతంలో పలువురు కోతుల దాడిలో తీవ్రంగా గాయపడ్డ ఘటనలు అనేకం. దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో కోతుల బెడద ఎక్కువ కావడంతో వానరాలతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వానరాలు కాలనీల్లో తిరుగుతూ కాలనీవాసులను హడలెత్తిస్తున్నాయి.ఇళ్లలోకి చేరి ప్రజలను భయభ్రాంతుల కు గురి చేయడమే కాకుండా ఆయా కాలనీల్లో గుంపులు.. గుంపులుగా తిరుగుతూ బీభత్సం సృష్టిస్తున్నాయి. దీంతో ఇళ్ల వద్ద ఉండే వారు సైతం కోతుల దాడుల్లో గాయాలపాలవుతున్నారు. గతంలో కోతుల దాడిలో గాయపడి దేవరకొండ పట్టణానికి చెందిన ఒకరు మృతి చెందగా మరికొంత మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినప్పటికి ప్రయోజనం లేకుండాపోతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కోతుల బెడద నివారించాలని పలువురు కోరుతున్నారు.

నామమాత్రపు చర్యలు

గతంలో దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో కోతుల బెడద ఎక్కువగా ఉండడంతో పట్టణంలోని ఆయా వార్డులకు చెందిన పలువురు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో కోతులను పట్టేవారిని పిలిపించి వాటిని తరలించారు. కానీ సమస్య మళ్లీ మొదటికి రావడంతో పట్టణ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.సంబంధిత మున్సిపల్ అధికారులు నామమాత్రపు చర్యలతో సరిపెట్టకుండా కోతుల బారి నుండి కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఇటీవల మున్సిపల్ అధికారులు నెల్లూరు నుంచి కోతులు పట్టే వారిని పిలిపించి ఒక్కో కోతిని పట్టుకునేందుకు రూ.వెయ్యి చొప్పున ఖర్చు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు దాదాపు 310 కోతులను పట్టి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టినట్లు తెలుపుతున్నారు

కోతుల బెడదను నివారిస్తాం



దేవరకొండ పట్టణంలో కోతుల బెడదను నివారించేందుకు అన్ని చర్యలు తీసుకు ంటున్నాం. గతంలో కూడా మున్సిపాలిటీ పరిధిలో కోతుల బెడదను నివారించగలిగాం. మళ్లీ కోతులు సంచరిస్తుండడంతో నెల్లూరు నుంచి కోతులు పట్టే వారిని పిలిపించి ఇప్పటి వరకు 310 కోతులను పట్టి అటవీ ప్రాంతానికి తరలించాం. గతంతో పోల్చితే ప్రస్తుతం కోతుల బెడద కొంతమేర తగ్గింది.

– సురిగి శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, దేవరకొండ